

ఊరు.. తేనెలూరు

తాడిమర్రి మండలం చిల్లకొండయ్యగారిపల్లి హనీవిలేజ్‌గా పేరుగాంచింది. పలువురు తేనె సేకరించి, విక్రయించడం ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్నారు. 8లో



టమాట కిలో రూ.20

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.9, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.5°/13.3°

జిల్లా పరిధిలో ఆదివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

సబ్సిడీ పేరుతో దగా

- డ్రిప్, స్ప్రింక్లర్లు ఇస్తామని ప్రచారం
- రైతుల నుంచి రూ.కోటి వసూలు

సాక్షి, పుట్టపర్తి : అమాయక రైతులను లక్ష్యంగా చేసుకుని ఓ కేటుగాడు టోకరా వేశాడు. సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లను అందజేస్తామని రూ.కోటి వరకు వసూలు చేసి ఎగ్గొట్టాడు. మోసపోయామని గ్రహించిన బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకెళ్తే.. అనంతపురం జిల్లా నార్పలకు చెందిన రామాంజనేయ ప్రసాద్ ఓడీ చెరువు, గోరంట్ల, పుట్టపర్తి మండలాల్లోని గ్రామాలకు వెళ్లి తాను డ్రిప్ కంపెనీలో పని చేసే ఉద్యోగిగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ఆధారంగా తాము సబ్సిడీపై డ్రిప్ పైపులు ఇస్తామని చెప్పాడు. నిజమని నమ్మిన పలువురు రైతుల నుంచి డబ్బు కట్టించుకున్నాడు. ఈ క్రమంలో పుట్టపర్తి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన హరివర్ధన్‌రెడ్డితో రూ.50 వేలు, మల్లిరెడ్డి వద్ద నుంచి రూ.1.87 లక్షలు, చంద్రశేఖర్ నుంచి రూ.26,500, చలపతి వద్ద నుంచి రూ.16,500, వెంకటాద్రి నుంచి రూ.48,500 తీసుకున్నాడు. నెల రోజులు గడిచినా పరికరాలు ఇవ్వకపోయేసరికి డబ్బు చెల్లించిన వారు ఒత్తిడి చేశారు. దీంతో రామాంజనేయ ప్రసాద్ అడ్డం తిరిగాడు. ఇచ్చేది లేదని.. దిక్కున్న చోట చెప్పుకోండంటూ బెదిరించాడు. దీంతో బాధితులు ఇటీవల ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఓడీ చెరువు, గోరంట్ల తదితర ప్రాంతాల్లో కలిపి మొత్తం రూ.కోటి వరకు కొల్లగొట్టినట్లు బాధితులు వివరించారు.

దళారులను నమ్మొద్దు

ఏపీఎంఐపీ ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్లు పొందాలనుకున్న రైతులు ఆన్‌లైన్ పద్ధతి ద్వారా మాత్రమే నగదు లావాదేవీలు చేయాలి. రైతు సేవ కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నాక పొలాన్ని పరిశీలించిన తర్వాత బీఓక్యూ అయిన వెంటనే ఎంత నగదు చెల్లించాలో మొబైల్ నంబరుకు మెసేజీ వస్తుంది. దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దు. కొందరు కేటుగాళ్లు నకిలీ కంపెనీల పేర్లతో సబ్సిడీ ఇస్తామని రైతులను మోసం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. డ్రిప్, స్ప్రింక్లర్లు కావాల్సిన వారు ఆర్ఎస్‌కే లేదా మైక్రో ఇరిగేషన్ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

– సుదర్శన్,
మేనేజర్, ఏపీఎంఐపీ, పుట్టపర్తి

10 నుంచి శనీశ్వరస్వామి ఉత్సవాలు

పావగడ: ఈ నెల పదో తేదీన పావగడలో శనీశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 12 రోజుల పాటు ఉత్సవాలు సాగుతాయి. ఇందులో భాగంగా పదో తేదీ అంకురార్పణ, 11న మహా చండీ యాగం, జ్యేష్ఠాదేవి శనీశ్వరస్వామి కల్యాణోత్సవం, 12న బ్రహ్మ రథోత్సవం, 15న వెండి అడ్డపల్లకీ ఉత్సవం, 21 న ఉయ్యాలోత్సవం, శయనోత్సవం నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావాలని ఆలయ సమితి కోరింది.

వైభవంగా వీరకేతమ్మ బ్రహ్మారథోత్సవం



ప్రత్యేక అలంకరణలో వీరకేతమ్మ

మడకశిరరూరల్: కల్లుమర్రి సమీపంలో నిర్వహిస్తున్న వీరకేతమ్మ ఉత్సవాల్లో ఆదివారం బ్రహ్మారథోత్సవం వైభవంగా జరిగింది. వేకువ జామున ఆలయంలో అభిషేకం, తోమాలపూజ, నాగదేవత హోమం, చండీయాగం తదితర పూజా కార్యక్రమాలను పురోహితులు నిర్వహించారు. అనంతరం వందలాది మంది భక్తుల సమక్షంలో రథాన్ని లాగారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, పూలు, జాకెట్లు అర్చకులు అందజేసి ఆశీర్వదించారు. దాతలు, భక్తుల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



వీరకేతమ్మ రథాన్ని లాగుతున్న భక్తులు



సంక్షోభంలో చేనేత

చేనేత కేంద్రాలు ఎక్కడ చూసినా మగ్గాల చప్పుళ్లు.. కార్మికుల సందడితో మారుమోగుతుండేవి. ఇదంతా గతం. ఏడాది నుంచి పరిస్థితి భిన్నంగా మారింది. విపరీతంగా పెరిగిన ముడి పట్టు (రేషం, వార్పు) ధరలు ఒకవైపు, నేసిన పట్టుచీరలకు మద్దతు ధర లేక పోవడం మరోవైపు.. ఆదుకోవాల్సిన ప్రభుత్వం పైసా సాయం అందించకుండా తాత్సారం చేయడం వంటి కారణాలతో చేనేత రంగం పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయింది.

- భారీగా పెరిగిన ముడిపట్టు ధరలు
- పట్టుచీరలకు మద్దతు ధర కరువు
- రోజుకూలి సైతం గిట్టుబాటు కానివైనం

ధర్మవరం: మొన్నటి వరకు ఒక వెలుగు వెలిగిన చేనేత పరిశ్రమ నేడు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. కార్మికులకు రోజుకూలి రావడం కూడా గగనమైపోతోంది. దీంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారు. జిల్లాలో ప్రధాన చేనేత కేంద్రాలు ధర్మవరం, సోమందేపల్లి, పెనుకొండ, హిందూపురం, గోరంట్ల, చిలమత్తూరు తదితర ప్రాంతాలలో 24 వేలకు పైగా చేనేత మగ్గాలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 60వేల మందికి పైగా కార్మికులు, అనుబంధ రంగాల వారు చేనేత రంగంపై ఆధార పడి పని చేస్తున్నారు.

భారీగా పెరిగిన పెట్టుబడి వ్యయం

పట్టుచీరల తయారీకి ఉపయోగించే ముడిపట్టు (వార్పు, రేషం, జరీ) ధరలు ఏడాది కాలంలో 20 శాతానికి పైగా పెరిగాయి. గత ఏడాది కిలో రేషం 3,500, వార్పు కిలో రూ.3,800 ఉండగా.. ప్రస్తుతం కిలో రేషం రూ.4,200, కిలో వార్పు రూ.6వేలకు పెరిగాయి. జరీ సైతం గతంలో మార్కు జరీ రూ.600 ఉండగా.. ప్రస్తుతం రూ.750కు చేరింది. దీంతో ప్రతి చీరపైన 20 శాతం అధికంగా పెట్టుబడి వ్యయం పెరిగిపోవడంతో చేనేత కార్మికులకు లాభాలు రాక పోగా కనీసం రోజు కూలి కూడా రావడం గగనంగా మారింది. ముడిపట్టు ధరలు భారీగా పెరగడం, గత ఏడాది పట్టుచీర ధర ఎంత ఉంటే ప్రస్తుతం కూడా అంతే ధర ఉండటంతో చేనేతలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.



'నేతన్న నేస్తం' ఉంటే పరిస్థితి మెరుగ్గా...

గత వైఎస్సార్‌సీపీ పాలనలో ముడిపట్టు ధరలు పెరగడం, తగ్గడం సహజంగా ఉండేది. ఈ ఒడిదుడుకులను తట్టుకునేందుకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నేతన్న నేస్తం' పథకాన్ని 2019 డిసెంబర్ 21న ధర్మవరం నుంచి ప్రారంభించారు.



చేనేత మగ్గం నిలిపివేసిన దృశ్యం

ఈ పథకం కింద ఒక్కో చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు ముడి పట్టురాయితీని ఒకేసారి బ్యాంకు ఖాతాలో జమ చేసి ఆదుకునే వారు. ఇలా ఐదేళ్లపాటు క్రమం తప్పకుండా సాయం అందించారు. కరోనా వంటి కష్టకాలంలో రెండు నెలలు ముందుగానే నేతన్న నేస్తం నిధులు కార్మికుల ఖాతాల్లో జమ చేశారు. ఫలితంగా చేనేత కార్మికులు ప్రభుత్వం అందించిన సాయంతో చేనేత మగ్గాలను ఆధునీకరించుకుని గతంలో కంటే మెరుగైన డిజైన్‌లు వేసుకొని ఎక్కువలాభం సంపాదించి అభివృద్ధి చెందారు. జిల్లా వ్యాప్తంగా 16 వేల మంది కార్మికులకు రూ.178 కోట్లు, ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే 12 వేల మందికిపైగా చేనేత కార్మికులకు రూ.136 కోట్లు దాకా జమ చేసి చేనేత రంగానికి పునరుజ్జీవం తీసుకొచ్చారు.

కూటమి సర్కార్ చిన్నచూపు

కూటమి సర్కార్ చేనేతలను చిన్నచూపు చూస్తోంది. కార్మికులను ఎంతగానో ఆదుకున్న 'నేతన్న నేస్తం' పథకానికి సైతం మంగళం పాడింది. దీంతో ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడం.. ముడిపట్టు ధరలు పెరుగుతుండటంతో పీకల్లోతు నష్టాల్లోకి చేనేతలు నెట్టివేయబడుతున్నారు. దీంతో చాలా మంది కార్మికులు రేషం, వార్పు ధరలు తగ్గే వరకు మగ్గాలు నిర్వహించకుండా ఆపివేస్తున్నారు. మరికొంత మంది రాత్రింబవళ్లు మగ్గం నేస్తూ తక్కువ కూలీతోనే బతుకు వెళ్లదీస్తున్నారు. ఇంతటి దయనీయమైన పరిస్థితులను చేనేతలు ఎప్పుడూ చూసిన దాఖలాలు లేవు.

నాడు వైఎస్సార్‌సీపీ పాలనలో..	
గత ఐదేళ్లలో 'నేతన్న నేస్తం' ద్వారా రాష్ట్రంలోని చేనేత కార్మికులకు అందించిన సాయం	రూ.960 కోట్లు
శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా కార్మికులకు అందిన సాయం	రూ.178 కోట్లు
ఇందులో ధర్మవరం నియోజకవర్గంలోని కార్మికులకు అందింది	రూ.136 కోట్లు

నేడు కూటమి పాలనలో..
ముడిపట్టు ధరల పెరుగుదల 20 శాతం
పట్టుచీరల ధర గతంలో ఎంతో.. ఇప్పుడూ అంతే
కూటమి సర్కారు నుంచి చేనేత కార్మికులకు పైసా సాయం అందలేదు

ఇబ్బందులు పడుతున్నాం



ఏడాది కాలంగా ముడి పట్టు ధరలు విపరీతంగా పెరగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోజంతా మగ్గం నేసినా కూలి కూడా రావడం లేదు. ప్రభుత్వం స్పందించి ముడిపట్టు రాయితీని అందిస్తే ఉపయోగం ఉంటుంది.

–శ్రీలక్ష్మి, చేనేత కార్మికురాలు, ధర్మవరం

పట్టుచీరలకు మద్దతు ధర లేదు



పట్టుచీరలకు ఉపయోగించే ముడి సామగ్రి రేట్లు పెరిగాయి. కానీ పట్టుచీరల ధరలు మాత్రం గతంలో ఎంత ఉన్నాయో ఇప్పుడూ అంతే ఉన్నాయి. దీంతో చేనేత మగ్గంలో లాభాలకు బదులు అరకొర కూలి కోసం నేసే పరిస్థితి నెలకొంది. నేతన్న నేస్తం పథకం ద్వారా సాయం అందిస్తే మగ్గం నిర్వహణ సాఫీగా కొనసాగుతుంది. లేదంటే ప్రశ్నార్థకమే.

–చౌడమ్మ, చేనేత కార్మికురాలు, ధర్మవరం

నేతన్న నేస్తం పునరుద్ధరించాలి



ప్రస్తుతం చేనేత మగ్గాల నిర్వహణ కష్టతరంగా ఉంది. నాడు నేతన్న నేస్తం పథకం ద్వారా రూ.24 వేలు సాయం అందించేవారు. దీంతో కొంత ఊరట లభించేది. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి నేతన్ననేస్తం పథకాన్ని పునరుద్ధరించాలి. లేదంటే మగ్గాలు నేయడం మరింత కష్టమవుతుంది.

–ఓబుళపతి,
చేనేత కార్మికుడు, ధర్మవరం

చేనేత మనుగడ కష్టమే



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముడిపట్టుకు రాయితీ కోసం అప్పట్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తర్వాతి కాలంలో ప్రవేశపెట్టిన 'నేతన్న నేస్తం' పథకానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం మంగళం పాడి చేనేత కార్మికులకు మరణ శాసనం రాయాలని చూస్తోంది. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే చేనేత మనుగడ కష్టమే.

–జింకా కంబగిరి, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు

బాలయ్య దిగజారుడు రాజకీయాలు

హిందూపురం: అధికారం కోసం ఎమ్మెల్యే బాలకృష్ణ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలో తమకు అనుకూలంగా ఓటు వేయకుంటే కేసులు పెట్టి.. కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆదివారం హిందూపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సమన్వయకర్త టి.ఎన్.దీపికతో కలిసి ఉషశ్రీచరణ్ విలేకరులతో మాట్లాడారు. గత మున్సిపల్ ఎన్నికల్లో 30 స్థానాలు సాధించిన వైఎస్సార్‌సీపీ.. టీడీపీ తరఫున గెలిచిన ఆరుగురు కౌన్సిలర్లను తమవైపు లాక్కోవడం పెద్ద విషయం కాదని, అయితే తమ అధినేత వైఎస్ జగన్ అటువంటి నీచ రాజకీయాలను ప్రోత్సహించలేదని గుర్తు చేశారు. గెలవలేమని తెలిసిన ప్రతిసారీ టీడీపీ బ్యాక్ డోర్ రాజకీయాలకు పాల్పడుతూనే ఉందని ఎద్దేవా చేశారు.

ప్రలోభాలు.. బెదిరింపులతో నెగ్గాలని..

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లలో కొందరిని ఎమ్మెల్యే బాలయ్య బెదిరింపులు.. ప్రలోభాలకు గురి చేసి తమ వైపు లాక్కోవడానికి క్యాంపు రాజకీయాలు నెరిపారని సమన్వయకర్త దీపిక విమర్శించారు. వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన వారంతా సొంత పార్టీ వైపే ఉండాలని కోరుతున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాన్ని నిలుపుకోవడానికి సహకరించాలన్నారు. మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో స్వల్ప మెజార్టీ స్థానాలు ఉన్న టీడీపీ.. చైర్మన్ గిరి కోసం ప్రజాస్వామ్యాన్నే ఖూనీ చేస్తోందని మండిపడ్డారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్, చిత్రంలో దీపిక, మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

నేడు పోలీస్ కార్యాలయంలో...

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. ప్రజలు తమ సమస్యల గురించి అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

పీఠం కోసం పచ్చ కుతంత్రం

- నేడు హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక
- అధికారం కోసం టీడీపీ పాకులాట
- వైఎస్సార్‌సీపీ విప్ లేఖను తీసుకోని ప్రిసైడింగ్ అధికారి

హిందూపురం: 'పురం' మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నేపథ్యంలో రసవత్తర రాజకీయం నెలకొంది. బలం తక్కువ ఉన్నప్పటికీ అధికార పీఠాన్ని చేజిక్కించుకోవాలని తెలుగుదేశం పార్టీ కుయుక్తులు పన్నుతోంది. ఇప్పటికే పార్టీ కౌన్సిలర్లతో క్యాంపులు నిర్వహించింది. ఎలాగైనా నెగ్గాలని తీవ్రస్థాయిలో పావులు కదుపుతోంది. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రిసైడింగ్ అధికారి/ పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పర్యవేక్షణలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందు కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. గతంలో కౌన్సిల్ హాలులో వార్డుల సంఖ్య ప్రకారం సీట్లు కేటాయించేవారు. ఈసారి ఆ సంప్రదాయం పక్కనపెట్టి టీడీపీకి అనుకూలంగా ఉండేలా ఇనుప బారికేడ్లతో రెండుగా విభజించారు. ఇక కార్యాలయ పరిసరాల్లోకి బయటి వ్యక్తులు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

విప్ లేఖ స్వీకరించని పీఓ

చైర్‌పర్సన్ ఎన్నిక నేపథ్యంలో ఒకరోజు ముందుగా విప్ లేఖను ప్రిసైడింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుంది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ సూచించిన అభ్యర్థికి మద్దతు తెలిపేలా విప్ జారీ చేస్తూ ఇచ్చిన లేఖను అందజేసేందుకు వైఎస్సార్‌సీపీకి చెందిన మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ బలరామిరెడ్డి, వైస్ చైర్మన్ జబీవుల్లా, పార్టీ కౌన్సిలర్లు ఎస్‌ఏ శివ, ఆసీఫుల్లా, రామ చంద్ర, నాయకులు మహేష్, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, చాందు, రామకృష్ణారెడ్డి, లీగల్ సెల్ న్యాయవాది వెంకటకృష్ణారెడ్డితో కలిసి ఆదివారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ప్రిసైడింగ్ అధికారి లేరు. మధ్యాహ్నం 1.40 గంటలకు అధికారి వచ్చి.. కమిషనర్ చాంబర్ వద్ద వేచి ఉండాలని సూచించారు. తర్వాత 2.30 గంటలకు వచ్చి ఇప్పుడు లేఖ తీసుకునేది లేదని ప్రిసైడింగ్ అధికారి చెప్పారు. ఉదయం నుంచి వేచి ఉండాలని చెప్పి.. ఇప్పుడు తీసుకునేది లేదంటే ఎలా అని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గి ఇలా చేస్తున్నారని నిలదీస్తే.. మీరు ఆలస్యంగా వచ్చారని చెప్పి వెళ్లిపోయారు. విప్ జారీ చేయకుండా అడ్డుకోవడంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తెలిపారు.



మున్సిపల్ హాల్‌లో సీట్లను రెండుగా విభజిస్తూ ఏర్పాటు చేసిన బారికేడ్లు

అధికారం కోసం కుయుక్తులు

హిందూపురం మున్సిపల్ కౌన్సిల్‌లో వైఎస్సార్‌సీపీ 30, టీడీపీ ఆరు, బీజేపీ ఒకటి, ఎంఐఎం ఒకటి చొప్పున స్థానాలు దక్కించుకున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత చైర్‌పర్సన్ ఇంద్రజ టీడీపీ గూటికి చేరారు. తర్వాత చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. టీడీపీకి సంఖ్యాబలం తక్కువ ఉన్నప్పటికీ పలువురు వైఎస్సార్‌సీపీ సభ్యులను భయపెట్టి.. బెదిరించి.. తమవైపు లాక్కుని చైర్మన్‌గిరి దక్కించుకునేందుకు ఆ పార్టీ నేతలు కుయుక్తులు పన్నారు. క్యాంపు రాజకీయాలు నడుపుతూ.. ఎన్నిక సమయంలో సభ్యులను ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.



వైఎస్సార్‌సీపీ విప్ లేఖను తీసుకోని ప్రిసైడింగ్ అధికారి ఆనందబాబు

గీత దాటితే కౌన్సిలర్లపై వేటు

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు విప్‌ను ధిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. తమ పార్టీ గుర్తుపై గెలిచిన వారిని టీడీపీ బలవంతంగా లాక్కుని ఓటింగ్ చేయించుకోవాలని చూస్తే తాము న్యాయ పోరాటం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ సింబల్, వైఎస్ జగన్ పేరు చెప్పి గెలిచిన కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీకే ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. అలా కాదని గీత దాటితే కౌన్సిలర్లపై సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు.

క్లుప్తంగా

ఫీజు పోరు ర్యాలీకి జీపీఎస్ మద్దతు

పుట్టపర్తి టౌన్: రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం ఈ నెల 5న వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ర్యాలీకి గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) మద్దతు తెలిపింది. ఈ మేరకు జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పట్టపగలే చోరీ

ఓడీచెరువు: మండలంలోని గానిపల్లికి చెందిన సోమశేఖర్‌రెడ్డి ఇంట్లో భారీ చోరీ జరిగింది. గ్రామంలోని కదిరి– హిందూపురం ప్రధాన రహదారి పక్కనే నివాసముంటున్న ఆయన బంధువుల ఇంట శుభకార్యం ఉండడంతో ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి కదిరి సమీపంలోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయానికి వెళ్లాడు. గమనించిన దుండగులు ఆదివారం పట్టపగలే ఇంట్లోకి చొరబడి బీరువాను ధ్వంసం చేసి రూ.2.50 లక్షల నగదు అపహరించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఓడీ చెరువు మండలంలో వరుసగా ఇది మూడో చోరీ కావడం గమనార్హం. వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

ఆంధ్ర వెటరన్స్ ఘన విజయం



విజేత ఆంధ్రా వెటరన్స్ జట్టు

అనంతపురం: పీవీకేకే ప్రసాద్ స్మారక సౌత్ జోన్ వెటరన్ క్రికెట్ టోర్నీ విజేతగా ఆంధ్ర వెటరన్స్ జట్టు నిలిచింది. ఆంధ్ర, తమిళనాడు జట్ల మధ్య ఆదివారం ఆర్డీటీ క్రీడా గ్రామంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి తమిళనాడు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో ఆంధ్ర జట్టు 8 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసింది. ఏజీ ప్రవీణ్ 38 పరుగులు, జి.ఎలజెర్ 32 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తమిళనాడు జట్టు 19.3 ఓవర్లలో 106 పరుగుల వద్ద చతికిలబడింది. ఆంధ్రా బౌలర్లు ఎస్ఎస్ భరత్ కుమార్ 5 వికెట్లు తీసి తమిళనాడును కోలుకోలేని దెబ్బ తీశాడు. 82 పరుగుల తేడాతో ఆంధ్ర వెటరన్స్ జట్టు విజయం సాధించింది. బెస్ట్ బ్యాటర్‌గా ఎస్పీ నాథన్ (తమిళనాడు), బెస్ట్ బౌలర్‌గా సురేష్‌బాబు (తమిళనాడు), బెస్ట్ వికెట్ కీపర్‌గా ఆర్ఎల్వీ ప్రసాద్ (ఆంధ్ర), ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ఎస్ఎస్ భరత్‌కుమార్ (ఆంధ్ర) నిలిచారు.

17 గొర్రెలు మృతి

కణేకల్లు: మండలంలోని జక్కలవడికి గ్రామంలో బోరువద్ద నీరు తాగి 17 గొర్రెలు మృతిచెందాయి. గొర్రెల కాపరులు రాముడు, వన్నూరుస్వామి గొర్రెలను మేత కోసం తీసుకెళ్లారు. నీళ్లు తాపడానికి బోరుబావి వద్దకు తీసుకెళ్లారు. నీరు తాగిన గొర్రెలు కాసేపటి తర్వాత కుప్పకూలాయి. రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు ఎస్ఐ నాగమధులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెటర్నరీ డాక్టర్ మృతి చెందిన గొర్రెలకు పోస్టుమార్టం చేశారు.

చిల్లకొండయ్యపల్లి సమీపంలో విస్తరించిన అటవీ ప్రాంతం



ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఇది కూడా అలాంటి ఊరే. ఈ ఊరు పేరు చెబితే చాలు నోరూరుతుంది. తియ్యని పిలుపు రారమ్మంటుంది. అదే తాడిమర్రి మండలంలోని చిల్లకొండయ్యపల్లి. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయంతో నష్టపోయిన రైతులు.. ఉపాధి కోసం అడవి బాట పట్టారు. కొండ, గుట్టలెక్కుతూ తేనె సేకరించి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

ఊరు.. తేనెలూరు

- రారమ్మంటున్న 'హనీ విలేజ్'
- స్వచ్ఛమైన తేనెకు చిరునామా చిల్లకొండయ్యపల్లి
- కొండ, గుట్టల్లో తేనె సేకరిస్తున్న గ్రామస్తులు
- 25 కుటుంబాలకు ఉపాధి

సమ్‌థింగ్ Special



తేనె తెట్టె నుంచి తేనెటీగలను లేపిన దృశ్యం


తాడిమర్రి: ఉదయమే సద్దిమూట కట్టుకుని అందరూ పొలం బాట పడితే తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి యువకులు మాత్రం అడవిబాట పడతారు. కొండ, గుట్ట, చెట్టు, చేమ ఇలా చుట్టేస్తూ సేకరించిన స్వచ్ఛమైన తేనెను విక్రయించి కుటుంబాలను పోషించుకుంటున్నారు. గ్రామంలోని 25 కుటుంబాలు తేనె సేకరణను ఉపాధిగా మలచుకున్నాయి.

15 ఏళ్లుగా... తేనె సేకరణే వృత్తిగా

దాదాపు 15 సంవత్సరాలుగా తేనె సేకరణనే వృత్తిగా పెట్టుకుని చిల్లకొండయ్యపల్లి యువత జీవనం సాగిస్తోంది. అప్పట్లో వ్యవసాయ పనులు లేక పోవడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు కాటమయ్య అనే వ్యక్తి తొలిసారిగా తేనె సేకరణను ఉపాధిగా మార్చుకున్నాడు. అనంతరం అదే బాటలో కొందరు యువకులు పయనించారు. అయితే వీరు సేకరించిన తేనెకు సరైన మార్కెటింగ్ లేక ఇబ్బంది పడుతుండడంతో అప్పట్లో మహాత్మాగాంధీ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా ఉన్న రామలింగప్ప స్పందించి, గిట్టుబాటు ధరతో తేనె కొనుగోలు చేసేలా చెన్నకొత్తపల్లిలోని ధరణి స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదిర్చాడు. ప్రస్తుతం సంస్థ కిలో తేనెను రూ.400 చొప్పున కొనుగోలు చేస్తుండగా... స్థానికంగానే ఇతరులకు రూ.500తో విక్రయిస్తూ ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతున్నారు. ఉమ్మడి జిల్లాలో చిల్లకొండయ్యపల్లి తేనెకు మంచి గిరాకీ ఉంది.

అన్నం పెడుతున్న అడవి..

మండలంలోని దాడితోట బీట్ పరిధిలో కునుకుంట్ల, చిల్లవారిపల్లి, దాడితోట గ్రామాలతో పాటు పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామాల పరిధిలో సుమారు 3,534 హెక్టార్లలో రిజర్వు ఫారెస్టు విస్తరించి ఉంది. రిజర్వు ఫారెస్టులో అటవీ అధికారులు నారేపి, ఎర్రచందనం, తవసీ తదితర మొక్కలు భారీగా నాటారు. ఇప్పుడా మొక్కలు పెద్ద వృక్షాలై తేనెపట్టులకు ఆవాసాలుగా మారాయి. ఫలితంగా రిజర్వు ఫారెస్టు ఎందరికో ఉపాధి వనరుగా మారి అన్నం పెడుతోంది.



చిల్లకొండయ్యపల్లి ముఖచిత్రం

ముంగార్ల కాలం అనువైనది..

తేనె సేకరణకు ముంగార్ల కాలం అనువైనది. జూన్ ప్రారంభంతో వర్షాలు కురుస్తాయి. ఈ సమయంలో అడవులు, తోటలు, బీడు భూములు పచ్చదనం సంతరించుని పుష్పాలు వికసిస్తాయి. ఆ పుష్పాల్లోని మకరందం కోసం వచ్చే తేనెటీగలు సమీపంలోనే తేనెపట్టులను ఏర్పాటు చేసుకుంటాయి. ఏడాదిలో సుమారు 9 నెలల పాటు తేనె సేకరణలో ఇక్కడి యువకులు నిమగ్నమవుతారు. నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తోందని చెబుతున్నారు.



తేనెను శుద్ధి చేస్తున్న యువకుడు సూరి

తేనె సేకరణలో కష్టాలు ఎన్నో..

తేనె ఎంత రుచిగా ఉంటుందో దానిని సేకరించడమంటే అంతకు రెట్టింపు కష్టాన్ని చవిచూడాల్సి ఉంటుంది. అయినా చిల్లకొండయ్యపల్లి యువకులు కష్టాలను లెక్కచేయడం లేదు. కళ్లముందు తేనె పట్టు కనిపిస్తే చాలు వెంటనే సేకరణలో నిమగ్నమవుతారు. ఈ క్రమంలో ముళ్లకంపలు గుచ్చుకున్నా, తేనెటీగలు కుట్టినా తమ పట్టు మాత్రం వదలరు. ఎన్ని రక్షణ చర్యలు తీసుకున్నా... తేనెటీగలు కుట్టి తీవ్ర అస్వస్థతకు లోనైన సందర్భాలు ఎన్నో ఉన్నాయని యువత తెలుపుతోంది.

రుణాలివ్వాలి



అడవుల్లో తేనె సేకరణ ఏడాది పొడవునా ఉండదు. దీంతో తేనె సేకరించలేని సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. తేనెటీగల పెంపకానికి ప్రభుత్వం రుణాలిస్తే మాకు మేలు జరుగుతుంది. గ్రామంలోనే తేనెటీగల పెంపకంతో ఉపాధి పొందుతాం.

– చిల్లా నాగేష్, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి.

తేనె సేకరణ కష్టమైంది



ప్రస్తుతం తేనె సేకరణ చాలా కష్టంగా మారింది. గతంలో రోజుకు మూడు, నాలుగు కిలోల తేనె సేకరించేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. వర్షాలు సక్రమంగా కురవకపోవడం, పంటలపై పురుగు మందుల పిచికారీ ఎక్కువ కావడంతో తేనెటీగల ఉధృతి తక్కువైంది. ప్రభుత్వం స్పందించి తేనెటీగలకు అనుకూల వాతావరణం కల్పిస్తే మాకు మేలు జరుగుతుంది.

– చిల్లా హేమంత్, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి

ఉపాధి చూపుతున్నాం



రిజర్వ్ ఫారెస్టు సమీప గ్రామాల్లోని రైతులు, యువతకు అడవి ద్వారా ఉపాధి మార్గం చూపుతున్నాం. పశువుల మేత, తేనె పట్టు కోసం ప్రత్యేకంగా ప్లాంటేషన్ చేపట్టాం. అలాగే చెట్లను కొట్టకుండా పర్యవేక్షించడం, ఎండుగడ్డికి నిప్పు పెట్టకుండా గొర్రెలు, పశువుల కాపర్లకు అవగాహన కల్పిస్తున్నాం. అడవుల్లోకి వచ్చే రైతులు, యువకులు, మహిళలకు ఇబ్బందులు కలిగించకుండా బీట్ ఆఫీసర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాం.

– ఎస్.యామినీ సరస్వతి, ఎఫ్ఆర్ఓ, బుక్కపట్నం

భవిష్యత్తుకు భరోసా ఏదీ బాబూ?



మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- ఫీజు పోరును జయప్రదం చేద్దాం
- బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం
- రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికలకు ముందు ఇబ్బడి ముబ్బడిగా హామీలు గుప్పించి ప్రజల భవిష్యత్తుకు తనది గ్యారెంటీ అంటూ గొప్పలకు పోయిన చంద్రబాబు.. ప్రభుత్వం ఏర్పాటు చేసి 8 నెలలు కావస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ లేకుండా చేశారని రాప్తాడు నియోజవకర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ నెల 5న జిల్లా కేంద్రంలో జరిగే ఫీజు పోరు కార్యక్రమానికి పెద్ద ఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కేంద్రం విడుదల చేసిన బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగిందన్నారు. చంద్రబాబు చెప్పిన బుల్లెట్ రైలుకు, గోదావరి పరకచెర్ల లిఫ్ట్ ఇరిగేషన్, రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు ఎటువంటి కేటాయింపులు జరగలేదన్నారు. 16 మంది ఎంపీలున్న టీడీపీ కన్నా..12 మంది ఎంపీలున్న జేడీయూ తన రాష్ట్రానికి (బిహార్)కు నిధులు రాబట్టుకోవడంలో సఫలమైందన్నారు.

పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు 45.72 మీటర్లు కాగా, 41.1 మీటర్లకే పరిమితం చేశారని, పనులకు రూ.5,936 కోట్లు కేటాయిస్తున్నామని కేంద్రం బడ్జెట్‌లో స్పష్టం చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు 45.72 మీటర్లకు చేస్తే 600 గ్రామాలకు తాగునీరు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాకారమవుతుందన్నారు. అలాగే కృష్ణ, ఉభయ గోదావరి జిల్లాల్లో లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు,. 960 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి, విశాఖ నగరానికి తాగునీరు కూడా ఇవ్వొచ్చునన్నారు. రాయలసీమకు 80 టీఎంసీల నీటిని మళ్లిస్తామంటూ చంద్రబాబు చెప్పినవన్నీ కట్టుకథలేనని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత లక్షలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. నీతి అయోగ్ ఇచ్చిన నివేదిక ఆధారంగా చంద్రబాబు మాట్లాడిన తీరు చూస్తే తాము సంపదను సృష్టించిన తర్వాతనే సూపర్ సిక్స్ ఇస్తామని ప్రజలను దగా చేసే కుట్రకు తెరలేపారనేది స్పష్టమవుతోందన్నారు. ఇటీవల అసెంబ్లీలో రాష్ట్ర అప్పులు రూ.6 లక్షల కోట్లు అని ప్రకటించి... గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర అప్పు రూ.14 లక్షల కోట్లు అని ఎల్లోమీడియా, పురంధరేశ్వరితో చంద్రబాబు చెప్పించి తన నైజాన్ని బయట పెట్టుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాలతో ప్రజలకు మేలు చేశాన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలంటే బడ్జెట్‌లో రూ.1.50 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉందని, ఆ దిశగా ఇప్పటి వరకూ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్కే లింగారెడ్డి, చిరంజీవి, మీనుగ నాగరాజు, నీరుగంటి నారాయణ రెడ్డి, గంగుల సుధీర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఈశ్వరయ్య, నిఖిల్‌యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, మన్‌ప్రీత్‌రెడ్డి పాల్గొన్నారు.

గంటల వ్యవధిలోనే నిందితుడి పట్టివేత

ధర్మవరం రూరల్/పుట్టపర్తి టౌన్: కాపురానికి రాని భార్య, ఆమె తల్లిపై కొడవలితో దాడి చేసి కుమారుడిని ద్విచక్ర వాహనంపై అపహరించుకెళ్లిన యువకుడిని గంటల వ్యవధిలోని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు... ధర్మవరం మండలం బడన్నపల్లికి చెందిన లలిత కుటుంబ కలహాల నేపథ్యంలో తన భర్త బ్రహ్మచారిని విడిచి కుమారుడిని పిలుచుకుని పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలో ఆమెను కాపురానికి రావడం లేదన్న కక్షతో శనివారం రాత్రి లలిత, ఆమె తల్లిపై బ్రహ్మచారి కొడవలితో దాడి చేసి ఏడేళ్ల వయసున్న కుమారుడిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఉడాయించిన విషయం తెలిసిందే. ఘటనపై సమాచారం అందుకున్న డీఎస్పీ హేమంత్‌కుమార్... జిల్లాలోని అన్ని పీఎస్‌లను అప్రమత్తం చేశారు. వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం భూమయ్యగారి పల్లికి బ్రహ్మచారి చేరుకున్నట్లుగా గుర్తించిన పోలీసులు అక్కడకు చేరుకుని అక్కడి పోలీసుల సహకారంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని, ధర్మవరానికి పిలుచుకువచ్చారు. అతని వద్ద ఉన్న కుమారుడిని సురక్షితంగా తల్లి వద్దకు చేర్చారు. విషయం తెలుసుకున్న ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, సిబ్బందికి డీజీపీ రివార్డులు ప్రకటించారు.

వ్యక్తి దారుణ హత్య

- 44వ జాతీయ రహదారి సమీపంలోని చింత తోపులో ఘటన
- మృతుడు ధర్మవరం మండలం మల్కాపురం వాసి
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన అనంతపురం రూరల్ డీఎస్పీ



ఎరికల కాశీ మృతదేహం

రాప్తాడు రూరల్: ధర్మవరం రూరల్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన దేవరకొండ ఎరికల కాశీ (40) అనంతపురం నగర శివారులో దారుణ హత్యకు గురయ్యాడు. కక్కలపల్లి సమీపంలోని టమాట మండీలో గుమాస్తాగా పని చేస్తున్న ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. సొంతంగా ఓ వాహనాన్ని సైతం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అనంతపురం నగర శివారులోని 44వ జాతీయ రహదారి సమీపంలో సంగమేశ్వర ఫంక్షన్ హాల్ పక్కన చింతవనంలో హతమై కనిపించాడు. సమాచారం అందుకున్న అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, సీఐ శేఖర్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆదివారం మధ్యాహ్నం ఘటన జరిగినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. తలపై బండరాళ్లతో మోది హత్య చేసినట్లుగా ఆనవాళ్లు ఉన్నాయి. కాగా, మృతదేహం పరిసర ప్రాంతాల్లో ఖాళీ మందుబాటిళ్లు, వాటర్ బాటిళ్లు, స్నాక్స్ పార్శిల్ తెచ్చుకున్న కాగితాలు పడి ఉండడంతో... కాశీతో పాటు ఇక్కడ డిన్నర్ చేసుకున్నవారే ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. రెండు నెలలుగా ఇంటికి సైతం వెళ్లకుండా టమాట మండీలోనే ఉన్నట్లుగా తెలిసింది. ఈ క్రమంలో కుటుంబంలో ఏవైనా గొడవలున్నాయా? లేదా ఆర్థిక లావాదేవీలా? వివాహేతర సంబంధాలు ఏమైనా కారణమా? అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగుతోంది. ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కలుషిత నీరు తాగి గేదెలు మృతి

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో ఆదివారం విషపు నీరు తాగి రైతు కావేలప్పకు చెందిన రెండు గేదెలు మృతిచెందాయి. దొడగట్టకు చెందిన రైతు కావేలప్ప రోజులాగే గేదెలను పొలం వద్దకు తీసుకెళ్లాడు. పంటకు పిచికారీ చేసిన నీరు తాగి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.1 లక్షపైగా నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

టీడీపీ నేతపై పోక్సో కేసు నమోదు

కణేకల్లు: బాలికను వేధింపులకు గురి చేసిన అంశానికి సంబంధించి టీడీపీ నేతపై చర్యలు తీసుకోవడంలో మీనమీసాలు లెక్కించిన పోలీసులు ఎట్టకేలకు శనివారం రాత్రి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వివరాలు... కణేకల్లు మండలంలోని ఓ గ్రామానికి చెందిన నిరుపేద బాలికను టీడీపీ నేత ముక్కన్న లైంగికంగా వేధించిన విషయం తెలిసిందే. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో మూడు రోజుల క్రితం బాలిక ఆత్మహత్యాయత్నం చేయబోయింది. సకాలంలో గుర్తించిన గ్రామస్తులు, తల్లిదండ్రులు వెంటనే బాలికను కాపాడి, విషయం తెలుసుకున్నారు. అనంతరం స్థానికులంతా ఏకమై టీడీపీ నేత ముక్కనను గ్రామంలో కట్టేసి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ముక్కనను విడిపించారు. అనంతరం ఘటనపై బాలిక తల్లి నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదులో జాప్యం చేస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే విషయం కాస్త పత్రికల ద్వారా బహిర్గతం కావడంతో నిందితుడిపై ఎట్టకేలకు శనివారం రాత్రి ఐపీసీ 75/1, పోక్సో యాక్ట్ 11, 12కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పంటలు దగ్ధం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో ఆదివారం ఐదు ఎకరాల కంది పంట ప్రమాదశాత్తూ మంటలు చెలరేగి కాలిపోయింది. రైతు వెంకటేశులు సాగు చేసిన ఐదెకరాల్లో కంది పంటకు మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న రైతు అక్కడకు చేరుకునే లోపు పంట మొత్తం కాలిపోయింది. ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇస్తే.. సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని, ఘటనతో దాదాపు రూ.లక్ష నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

- మండల పరిధిలోని బోరంపల్లిలోనూ రైతు తిప్పేస్వామికి చెందిన రెండు ఎకరాల మొక్కజొన్న, ఎకరం అరటి పంటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి, పూర్తిగా కాలిపోయాయి. రైతులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారుగా రూ.2 లక్షలు నష్టపోయినట్లు బాధిత రైతు తిప్పేస్వామి తెలిపాడు.

తల్లీపిల్లల ఆచూకీ లభ్యం

బత్తలపల్లి: కుటుంబకలహాల నేపథ్యంలో తన ముగ్గురు పిల్లలతో కలసి కనిపించకుండా పోయిన వివాహిత ఆచూకీని పోలీసులు గుర్తించి తిరిగి భర్త వద్దకు చేర్చారు. వివరాలు.... బత్తలపల్లి మండలం సూర్యచంద్రాపురం గ్రామానికి చెందిన కుళ్లాయప్ప, సాకే గంగాభవాని దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ముగ్గురు పిల్లలను పిలుచుకుని గంగాభవాని శనివారం ఇల్లు విడిచి వెళ్లిపోయింది. దీంతో భర్త, కుటుంబసభ్యులు వెంటనే డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన బత్తలపల్లి సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ నేతృత్వంలో సిబ్బంది ముమ్మర గాలింపు చేపట్టారు. యల్లనూరు మండలంలోని చిలమకూరులోని ఆమె పుట్టింటికి వెళ్లి ఆరా తీశారు. అయితే ఆమె అక్కడ లేదని తెలుసుకుని వారి బంధువులకు ఫోన్ చేయడంతో వైఎస్సార్ జిల్లా పులివెందులలోని మేనత్త ఇంట్లో ఉన్నట్లు తెలుసుకుని అక్కడెళ్లి ఆమెను అదుపులోకి పిలుచుకుని బత్తలపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. అనంతరం భర్తను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ అనంతరం అప్పగించారు. ఆరు గంటల్లోపే మిస్సింగ్ కేసులో మిస్టరీని ఛేదించిన సిబ్బందిని ఎస్పీ రత్న అభినందిస్తూ, రివార్డు ప్రకటించారు.

రైలు కిందపడి వృద్ధుడి మృతి



క్రిష్టన్న (ఫైల్)

బత్తలపల్లి: రైలు కిందపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు... బత్తలపల్లి మండలం కోడేకండ్ల గ్రామానికి చెందిన నాగోతి క్రిష్టన్న(60), మంగమ్మ దంపతులు, వీరికి మతిస్థిమితం లేని ఓ కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా క్రిష్టన్న సైతం మతి స్థిమితం లేక ఎటు పడితే అటు తిరుగాడడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో చిన్నేకుంటపల్లి–డి.చెర్లోపల్లి గ్రామాల మధ్య పట్టాలపై నడుచుకుంటూ వెళుతున్న క్రిష్టన్న... రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పెన్నహోబిలంలో వసంత పంచమి



అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకొని ఆదివారం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొందరు తమ చిన్నారులను స్వామి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయించారు. దీంతో పాటు ఆలయ సన్నిధిలో వివాహాలు జరిగాయి. ఉదయం స్వామికి అభిషేకం, మహా మంగళహారతి నిర్వహించారు.

పంపనూరులో నేటి నుంచి మాఘ మాస పూజలు



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యం



రాహుకేతు హోమంలో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మాఘ మాసం సందర్భంగా ప్రతి సోమవారం పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం, మంజునాథునికి విశేష పూజలు, 9న శ్రీమహా గణపతి హోమం, 12న మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని విశేష అభిషేకాలు, 16న త్రిచవిధ సూర్యనమస్కారాలు, అరుణ హోమం, 26న మహాశివరాత్రి ఉత్సవముతో పాటు రుద్రాభిషేకాలు ఉంటాయన్నారు.

పోటెత్తిన భక్తులు

పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మాఘ మాసంలో వచ్చిన మొదటి ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమం పెద్ద ఎత్తున సాగింది. ఉప ఆలయాల్లోని మంజునాథస్వామి, పార్వతీదేవి అమ్మవారికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు.